బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయం

చిక్కడపల్లి, ఏప్రిల్ 13 : సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమావేశం జరిగింది. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్న పాశం రవిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు అందజేసిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతం ప్రచారం చేసి బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు భారీ మెజార్టీతో విజయం సాధించే దిశగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి నాయకునికి తగిన విధంగా గుర్తింపు లభిస్తుందని వివరించారు. ఈ సమావేశంలో గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, కిరణ్, ఆనంద్‌కుమార్, అందె పద్మ పాల్గొన్నారు.

పాశం రవిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఎన్‌బీఈఎంఎస్ గోల్డ్‌మెడల్ అవార్డుకు రేష్మ

సివిల్ అసిస్టెంట్ సర్జన్ రేష్మను అభినందిస్తున్న ఈఎన్‌టీ సూపరింటెండెంట్ శంకర్

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 13 : నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ జాతీయస్థాయిలో నిర్వహించే గోల్డ్‌మెడల్ అవార్డుకు ఈఎన్‌టీ దవాఖానలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రేష్మ ఎంపికైంది. ఎన్‌బీఈఎంఎస్ 22వ కాన్వకేషన్‌లో భాగంగా గోల్డ్‌మెడల్ అవార్డుకు రేష్మను డాక్టర్ కామేశ్వరన్ ఎంపిక చేయడంతో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ టి. శంకర్ పుష్పగుచ్ఛం అందించి ఆమెను అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. మే 10న న్యూఢిల్లీలో నిర్వహించనున్న 22వ స్నాతకోత్సవంలో రేష్మ అవార్డు అందుకోబోతున్నట్లు తెలిపారు.

హైదరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌యాదవ్ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి ముప్పిడి సీతారాంరెడ్డిని కలుసుకున్నారు. సీతారాంరెడ్డి శ్రీనివాస్ యాదవ్‌కు శాలువాకప్పి సన్మానించారు. ఉప్పుగూడ డివిజన్ అధ్యక్షుడు బి. బాల్‌రాజు, లలితాబాగ్ డివిజన్ అధ్యక్షుడు జమ్మి చెట్టు రాజు, చాంద్రాయణగుట్ట నాయకులు నవీన్‌కుమార్, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

- చాంద్రాయణగుట్ట

ఈఎన్‌టీలో వాటర్ ఫిల్టర్లు ప్రారంభం

ప్రభుత్వ దవాఖానల్లో శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు మంచుకొండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈఎన్‌టీ సూపరింటెండెంట్ డాక్టర్ టి. శంకర్ అన్నారు. శనివారం కోఠిలోని ఈఎన్‌టీకి ఫౌండేషన్ చైర్మన్ ఎం.ప్రకాశం నాలుగు వాటర్ ఫిల్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రకాశంతో కలిసి ఫిల్టర్లను ప్రారంభించారు. ఫౌండేషన్ చైర్మన్, ట్రస్టీలను సూపరింటెండెంట్ శంకర్, ప్రొ. డాక్టర్ సంపత్‌కుమార్‌సింగ్, డాక్టర్ ఆనందాచార్య, డాక్టర్ లోక సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ దుర్గాప్రసాద్ సన్మానించారు.

- సుల్తాన్‌బజార్

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

సాహితీ జిగీష సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో నిర్వహించిన శ్రీమద్రామాయణ సుధ కవి సమ్మేళనం ఆకట్టుకుంది. పెద్దూరి వెంకటదాసు, చిక్కా రామదాసు, ధూళిపాక అరుణ ప్రభావతి, మాధవి, రమణమ్మ, పద్మావతి, శ్యామల శ్రీరాముని విశిష్టతను వివరించారు. విశ్రాంత ఓయూ తెలుగు శాఖ ఆచార్యుడు వెలుదండ నిత్యానందరావు ముఖ్య అతిథిగా పాల్గొని కవులను సత్కరించారు. కార్యక్రమంలో బి. జయరాములు, సాహితీ జిగీష అధ్యక్షుడు బండారుపల్లి రామచంద్రారావు, కార్యదర్శి పులిగడ్డ విజయలక్ష్మి రఘుశ్రీ పాల్గొన్నారు.

- ముషీరాబాద్

ఉగాది జాతీయ పురస్కారాలు ప్రదానం

యువఆర్ట్ థియేటర్స్ 20వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఉగాది జాతీయస్థాయి పురస్కారాలు ప్రదానం చేశారు. మాజీ మంత్రులు ఎస్. వేణుగోపాలాచారి, కె. పుష్పలీల పాల్గొని సినీ, సాంస్కృతిక, వైద్య, రాజకీయ రంగాల వారికి పురస్కారాలతో సన్మానించారు. లయన్ చిల్లా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మందడి కృష్ణారెడ్డి, సాయికుమార్‌రెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, గుర్రం శంకర్, ఎస్‌బీ రామయ్య, దాసు సురేశ్, కేశవనాథంగౌడ్, బీఆర్ వెంకటరమణ, శ్రీమాన్ పాల్గొన్నారు.

- ముషీరాబాద్, ఏప్రిల్ 13

ప్రాచీన లలితకళలు దేశ వారసత్వ సంపదలని ప్రముఖ బుల్లి తెర నటుడు భవానీశంకర్, నటి జ్యోతిరెడ్డి అన్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ 11వ వార్షికోత్సవాలు శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భవానీశంకర్, జ్యోతిరెడ్డి విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ చైర్మన్ లయన్ కె.వి రమణారావు సభకు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు లలితా రావు, పద్మావతి, స్వప్న శ్రీనివాస్, నాట్యగురువులు పాల్గొన్నారు.

- రవీంద్రభారతి

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

చిక్కడపల్లి,ఏప్రిల్ 13 : రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని సామాజిక రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రలో పూలే అంబేద్కర్ జన జాతర సదస్సును నిర్వహించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో టీపీఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ జి. రాములు, కేవీపీఎస్ అధ్యక్షుడు జాన్ వేస్లీ, చేతి వృత్తి దారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ రవీందర్, అబ్బాస్, గుమ్మడి రాజు పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారం దక్కినప్పుడే మహనీయులకు నివాళి

చిక్కడపల్లి, ఏప్రిల్ 13 : బహుజనులకు రాజ్యాధికారం దక్కినప్పుడే మహానీయులకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని అఖిల భారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి నూరెల్లి రవికుమార్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో బహుజనులకు 'రాజ్యాధికారం– కుల సంఘాల పాత్ర'పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కరిస్టు జె.బి. రాజు, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వై.కె. రత్నం, విద్యావేత్త వడ్డేపల్లి కృష్ణ, పద్మశాలి సంఘం నాయకులు కొక్కుల దేవేందర్, అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణ, చిక్కాదేవదాస్, అశోక్ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న రవికుమార్

జోషివాడి వీకర్‌సెక్షన్‌లో కార్డన్‌సెర్చ్

ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తనిఖీలు చేపడతామని కుల్సుంపురా ఏసీపీ మునావర్ పేర్కొన్నారు. టప్పాచబుత్రా పీఎస్ పరిధిలోని జోషివాడి వీకర్‌సెక్షన్ కాలనీలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పత్రాలు, నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 14 మంది రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. టప్పాచబుత్రా ఇన్‌స్పెక్టర్ రాములు, గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ రాజు, కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ రామస్వామి, ఎస్ఐలు అంబేద్కర్, అబ్దుల్ ఆదిల్, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

- అబిడ్స్

గెస్ట్ లెక్చరర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

చిక్కడపల్లి, ఏప్రిల్ 13 : గెస్ట్ లెక్చరర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరం అన్నారు. తెలంగాణ రాష్ట్ర డిగ్రీ లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గెస్ట్ లెక్చరర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కొర్ర ఈశ్వర్‌లాల్ మాట్లాడుతూ.. డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్‌కు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.50వేల వేతనంతో పాటు 12 నెలలకు కాన్సాలిడేట్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి నిజ్జన రమేశ్ , నర్సింగ్‌శంకరయ్య, అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కె. జ్యోతి, ప్రధాన కార్యదర్శి బుగ్గనాయక్, సెక్రటరీ గణేశ్ , మౌనిక పాల్గొన్నారు.

చరిత్రకు సజీవ సాక్షం ఫొటోగ్రఫీ

చరిత్రకు సజీవ సాక్షం ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ అని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన డైరీ ఆవిష్కరణ సభను శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జబర్దస్త్ ఫేమ్ సుధాకర్‌గౌడ్, అసోసియేషన్ వ్యవస్థాపకుడు జి. శ్రీధర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. రుషీశ్వర్, జి. కరుణాకార్‌గౌడ్, కోశాధికారి ఎం. వేణు, ఉపాధ్యక్షుడు కె. వీరేశ్ పాల్గొన్నారు.

- చిక్కడపల్లి

కలుషిత నీటి సరఫరా అరికట్టడానికి..

కలుషిత నీటి సరఫరాను అరికట్టడానికి జలమండలి అధికారులు చర్యలు చేపట్టారు. నిజాం కాలనీలో ఆధునిక యంత్రాలతో కలుషిత నీటి సరఫరా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేపట్టారు. పనులను జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్, జలమండలి మేనేజర్ వెంకటేశ్‌తో కలిసి పరిశీలించారు.

- మెహిదీపట్నం

ఉప్పుగూడ డివిజన్ పరిధిలో హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత పర్యటించారు. ఆమె ఇంటింటికీ తిరుగుతూ కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పలువురు నాయకులు కార్యకర్తలు ఆమెకు శాలువాకప్పి సన్మానించారు.

- చాంద్రాయణగుట్ట

మోదీ నాయకత్వం అవసరం

కాచిగూడ, ఏప్రిల్ 13: మోదీ నాయకత్వం దేశానికి అవసరమని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఎక్కాల కన్నా ఆధ్వర్యంలో శనివారం కాచిగూడ మాజీ కార్పొరేటర్ ఎక్కల చైతన్య కార్యకర్తలతో కలిసి శనివారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు, నందకిశోర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ వనం రమేశ్, చిట్టి శ్రీధర్, సూర్య ప్రకాశ్‌సింగ్, క్షీర్‌సాగర్, అరవింద్ పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం

కాచిగూడ, ఏప్రిల్ 13: గృహిణి అదృశ్యమైన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నరేశ్ తెలిపిన ప్రకారం.. గోల్నాకలోని సంజీవయ్యనగర్‌కు చెందిన శంకర్, భూమ రేణుక భార్యాభర్తలు. వారు కొన్నిరోజులుగా గొడవ పడతున్నారు. మనస్థాపం చెందిన రేణుక శుక్రవారం సాయంత్రం ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు అదేరోజు రాత్రి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంట్లోంచి వెళ్లే సమయంలో రేణుక నలుపు రంగు టాప్, నీలి రంగు జీన్స్ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెలుగుయూనివర్సిటీ, ఏప్రిల్ 13 : పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నాంపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. నేచర్ క్యూర్ దవాఖాన – ఫతేనగర్ రైల్వేస్టేషన్ల మధ్య శనివారం ఉదయం 30 ఏండ్ల వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకొన్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపరిచి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తెలుపు ప్యాంటు, షర్టు ధరించి ఉన్నాడని .. వివరాలకు 9848349544, 040–23202238 లో సంప్రదించాలని సూచించారు.

ట్యాక్స్ ఎగొట్టే వాళ్ల నుంచి బీజేపీ ఎలక్ట్రోరల్ బాండ్స్

రవీంద్రభారతి, ఏప్రిల్ 13 : అవినీతి రహిత పాలన అందిస్తామని చెప్పే బీజేపీ జీఎస్టీ, ట్యాక్స్ ఎగొట్టిన కంపెనీల నుంచి ఎలక్ట్రోరల్ బాండ్ల రూపంలో నిధులను సేకరించిందని మాజీ ఎంపీ రవీంద్రనాయక్ విమర్శించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర పార్టీలో గాని కేంద్ర పార్టీలో గాని గిరిజనులకు బంజారాలకు స్థానమెందుకు కల్పించలేదని ప్రశ్నించారు. సమావేశంలో ఈబీసీ జాతీయ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

యూజీ.. స్నాతకోత్సవం

ఉస్మానియా మెడికల్ కళాశాలలో యూజీ వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రకుమార్, ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్, సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కె. రాజ్యలక్ష్మి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టకీయుద్దీన్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సుధ హాజరై సుమారు 250 మంది యూజీ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేసి అభినందించారు.

- సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 13

నిలోఫర్ దవాఖాన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి ఆ సంఘం జెండా ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు డి. రవీందర్, ప్రధాన కార్యదర్శి ఎస్. ప్రవీణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

- తెలుగు యూనివర్సిటీ

నాట్యగురువు ఉదయ్ రేణుక శిష్యురాలు భావన ప్రదర్శన ఆకట్టుకున్నది. రవీంద్రభారతిలో సూపుర్ కూచిపూడి ఆర్ట్స్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో భావన కూచిపూడి రంగ ప్రవేశం చేసింది. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి మైసూ రారెడ్డి, వాసవీ అకాడమీ అధ్యక్షుడు పెండెకంటి రామ్మోహన్‌రావు విచ్చేశారు.

- రవీంద్రభారతి

జాతీయ చేనేత ఎక్స్‌పో ప్రారంభం

ఎన్టీఆర్ స్టేడియంలో జాతీయ చేనేత ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి

కవాడిగూడ, ఏప్రిల్ 13 : చేనేత, చేతి వృత్తుల వారు తయారు చేసిన వస్తువులు, వస్త్రాలను కొనుగోలు చేసి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. శనివారం రాత్రి ఎన్టీఆర్ స్టేడియంలో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను వేణుగోపాలాచారి, రిటైర్డ్ జడ్జి జస్టిస్ మధుసూదన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల 300 స్టాళ్లను అతిథులు సందర్శించారు. ఉ.11 నుంచి రా.10 వరకు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌ను నగర ప్రజలు సందర్శించి, కొనుగోలు చేసి కళాకారులకు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు కోట దేవిక, నిర్వాహకులు సత్యనారాయణ చౌదరి, మహేశ్, సాయిచౌదరి, నదీమ్ పాల్గొన్నారు.

గన్‌ఫౌండ్రి మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్తా దంపతులు కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి ఆయన నివాసంలో కలిసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను బహూకరించారు.

- అబిడ్స్

జియాగూడ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీనరసింహ, బంగారు మైసమ్మ ఆలయం ప్రతినిధి మదన్‌మోహన్ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నాయకులు బొట్టు రామ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలో చేరారు.

- అబిడ్స్

పోస్టర్ ఆవిష్కరణ..

పాతబస్తీ తానాజీనగర్ మీదుగా పలు ప్రాంతాల్లో ఈ నెల 17వ తేదీన సంఘ సేవకులు తాడెం శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరామనవమి ర్యాలీ పోస్టర్‌ను శనివారం దక్షిణ మండలం డీసీపీ పి. సాయి చైతన్య చేతుల మీదుగా ఆవిష్కరించారు.

– చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 13

రెడ్‌హిల్స్ డివిజన్ బజార్‌ఘాట్ ఏసీగార్డ్స్‌లో ఎంఐఎం నాయకుడు సుభాన్ ఏర్పాటు చేసిన ఈద్‌మిలాప్‌కు నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

- మెహిదీపట్నం

లంగర్‌హౌస్‌లో ఎగ్జిబిషన్

చిన్నారుల్లో ఆలోచనా శక్తిని పెంచే విధంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. లంగర్ హౌస్, బాపూఘాట్ సంగం సమీపంలో అమెరికా వైట్‌హౌస్ నమూనాతో ఇన్‌ఫాంట్ హ్యాండ్లూమ్, హ్యాండిక్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే, నిర్వాహకుడు రాబ్సన్‌తో కలిసి ప్రారంభించారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్, వజీఉజ్జమాసిద్ధిఖీ పాల్గొన్నారు.

- మెహిదీపట్నం

వంశీ ఆర్ట్స్ థియేటర్స్ స్వర్ణోత్సవాల్లో భాగంగా వారణాసి మాధురి రచించిన కామన్‌సెన్స్ గ్రంథాన్ని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు తన నివాసంలో ఆవిష్కరించారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, బూరుగుపల్లి రాధా వ్యాసకృష్ణ, సాయిశంకర్ పాల్గొన్నారు.

- ముషీరాబాద్